# "నాకు తిండి లేకపోతేనేంగాక!"

★

జీవన ప్రభాత్.

ఎప్పటివరకూనో యెందుకు?

ఈరోజు—ఇప్పుడూ—

తిండిలేకనే మలమల మాడిపోతున్నాను!

అయితే నేం?–నాకు తిండి లేకపోతే నేం గాక!

—లోకం నడవదా?—భూమి తిరగదా?—

ప్రకృతి వెళ్ళదా?—ప్రాణి నిలవదా?—రోజు గడవదా?

నేనుంటే నేం? ఊడితే నేం?...దుఃఖపడితే నేం? సుఖపడితే నేం?

* * *

కాని—

ఈ లోకంకంటే—నా యీ ప్రాణంకంటే—అన్నిటికంటే...ఉత్తమమైనవీ, నాకు ప్రియమైనవీ—అయిన రెండు ప్రాణాలు,

తిండిలేక నాతో సరిసమానంగా మలమల మాడిపోతున్నాయి. ఇది నే సహించలేను—నా జీవి భరించలేదు.

నా బిడ్డలు...ఇద్దరు...నూతనంగా ఈ లోకంలో కన్నువిచ్చిన పసిపాపలు! పెద్ద కోనేటిలో, ఇప్పుడే రేకలు విచ్చిన పద్మాలువారు!—

నా శరీరంలోంచి వూడిపడి, నామీదనే ఆధార పడివున్న—నా ఛాయలు—నా స్వరూపాలు!

వారితోటిదే లోకం. వారిమీదనే మమకారం!

వారికోసమనే నా యీ జీవనం!

* * *

భర్త చనిపోయాడనే చింత నా కేమాత్రమూ లేదు. బంధువులందరూ నన్ను విడిచారనే చింత లేదు. సంఘం వెలివేసిందే అన్న భయమూ లేదు—

ఒక్కటి!

నేను నిస్సహాయని. దిక్కులేని దాసిని, దరిద్రురాలిని. పాపిని!

నాతో—ఈ రెండు జీవులూకూడా వున్నయే?

వీటి నేం చెయ్యను? ఎక్కడ విడిచిపోను? ఎవరికిచ్చిపోను? కూడా తీసుకుపోదునా?—ఎక్కడికి? ఎలాగ?

నాకు తిండి లేకపోతేనేం గాక! వాళ్ళ విషయం?—ఇదే నన్ను బాధించేది—నన్ను దుఃఖపెట్టేది—నన్ను అఘాతంలోనికి పడద్రోసేది!

* * *

నేనొక పర్వత శిఖరంమీదవున్నాను. ఒకవైపు బ్రహ్మాండ జలపాతం. రెండోవైపు పట్టపగలైనా కటిక చీకటే గోచరమయ్యే పాతాళం...ఇంతే కాదు ఇప్పుడు చీకటిగావుంది. పెనుగాలి వీచేలాగుంది, ఆకాశాన్నైనా తారలు కానరావు!

అవును ఒకమూల మాత్రం రెండు చిన్న మినుకు మినుకుమనే తారలు వున్నాయి. వాటి ప్రకాశం వల్ల నేను గట్టుచేరలేను—ఇప్పటికే కాదు—ఎప్పటికీను!

కాని ఆ తారలమీదనున్న ఆశమాత్రం పోవడంలేదు. వాటికోసమని బయలుదేరనా?–ఈ నిశలో, దుఃఖమయ సాగరయాత్రకి?...

ఏమని ప్రార్థించను? ఎవరిని ప్రార్థించను?

నాకు మీరందరూ చెప్పే దేవుడిలో ఇదివరకే నమ్మకం పోయింది—నా గడచిన రోజులు తలుచుకుంటే—ఇంక దేవుణ్నే కాదు, ఎవర్నీ నమ్మకూడదనిపిస్తోంది.

* * *

వీరిని నే నొదల్లేను. వారికోసమని బ్రతుకుతాను ఈ కష్టాలు గడవ ప్రయత్నిస్తాను. అక్కర్లేదు, కొంతవరకైనా గడవగలను!...

సర్వాశలూ వదలుకున్నా—అన్ని దిక్కులా గాలించి నిరాశ చెందినా—అందరిచేతా కాలదన్నబడ్డా—

అయినా ఈ బతుకెందుకు?

ఈ యిద్దరి కోసమని!!

* * *

ఈ పది రోజులనుంచీ నే పడినఅవస్థ వర్ణనాతీతం. అబ్బ! ఎందరి ఇళ్ళతొక్కేనో!...మానం చంపుగుని ఎందరిని ఒక్క పిడచ పెట్టమని ప్రార్థించానో!—ఇంక ఆ నిమిషాలు తలుచుగోలేను...

నా శరీరం వాడిపోయింది—నాలో ముదిమి ఈ మూడు నాళ్ళలోనూ వింతగా చొచ్చుకువచ్చింది! నా రూపే మారిపోయివుంటుంది—నా అందమే పోయివుంటుంది— నా స్త్రీత్వమే నీరయిపోయిందేమో ననిపిస్తుంది.

నాకు ఏడాలనిపిస్తుంది గాని ఏడవలేను!...

ఇంక నిది నిశ్చయం—నాకు తిండిదొరకదు—ఒక నీటిబిందువేనా దొరకదు...నా బిడ్డలకి నానుండి కంటి నీరేనా—ఆఖరికి సానుభూతి మాత్రానికైనా—దొరుకుతుందనే ఆశలేదు.

* * *

కాని వారిని పోషించడం?

నాకు దిక్కులేదే—డబ్బులేదే—ఆఖరికి మిగిలి వుండే గౌరవంకూడా ఇప్పుడు మిగిలిలేదే!

నా తలలో అనేక దుర్బుద్ధులు ప్రవేశిస్తున్నాయ్. కాని అటువంటి మార్గాలవల్ల ధనం గడించలేను—ఆఖరికి, ఎలాగో ఈరోజు గడిచిందనిపించుకున్నా—నా పిల్లలనుంచి నేను వేరయిపోయే స్థితిలోకి కూడా వస్తాను.

* * *

అవును—ఏం?—అది తప్పెలాగవుతుంది? పాపం ఎలాగవుతుంది?

అది తప్పితే మార్గం?

అంతకంటే మంచి మార్గంలేందే—అసలు అదే పాపమయ్యే మాటయితే ఇంతమంది అదే బాటలో ఎందుకు నివశిస్తూవుంటారు?

వాళ్ళందరూ ఈ చీకటిబాటలో ప్రవేశించడానికి ఎంత మనోవ్యథపడ్డారో గదా! వాళ్ళ మానవ హృదయం ఎంత తపించిందోకదా! వాళ్ళ స్త్రీ వ్రతం ఎంత కంపించిందో కదా—

వాళ్ళందరూ ఎంతటి వుత్కృష్ట హృదయ సౌందర్యాన్ని కలిగివున్నారో గదా!

—అయితే, వాళ్లదీ ఒక ఉన్నతస్థానమే!

నేనూ ఆ మార్గంలో ప్రవేశిస్తాను...నిశ్చయం!

అన్ని శక్తులూ వుడిగినా—నాలో ఇంకా ఒక మహత్తరశక్తి మిగిలివుంది. అది స్త్రీ శక్తి. ఎంత కొంచమే మిగిలివుండివా—అంతటితోటే అనేక మందిని ఆకర్షించగలను—ఆశక్తివల్ల నాలో లేని అందాన్ని చొరిపించుగుని ఆఖరికి కొందర్నే నావశులను చేసుకోగలను...

ఎంత నీచంగా పరిగణింపబడితే మాత్రం?—పోనీ! ఆ విధంగావచ్చిన దమ్మిడీలతోటే నా బిడ్డలని పోషిస్తాను.—

* * *



—వాహినీవారి "సుమంగళి"నుంచి.

నే—నా శరీరాన్ని అమ్ముకున్నా—రోగాలతో బాధపడినా—ఆఖరికి చచ్చిపోయినా—

ఇది పడుపుకూడూ, నీచవృత్తీ, ఎంగిలి మెతుకూ అయినా—

అంతకు మించిన దిక్కు లేదు—

ఆ యెంగిలి మెతుగులే దిక్కు!

* *
*

ఇధి పాపం! పంకిలం—ఇంకా—ఇంకా—ఏమైనా...

ఇందులోకి నన్ను ఈడ్చింది సంఘం! బలవంతంగా, నే పెనగులాడుతోన్నా లెక్క చెయ్యక, ఈడ్చింది.

ఇది నా పాపం కాదు—

* *
*

ఇది అన్యాయార్జన కాదు—న్యాయమే! వాళ్ళ దగ్గర్నుంచి నే గుంజను—వాళ్ళే ఇస్తారు!...బజారులో వస్తువులు మన్ని యెలా ఆకర్షిస్తాయో—అలాగే వాళ్ళని అంతకంతకు ఆకర్షిస్తాను! కొంతమందిని వాళ్ళకి బలివేస్తాను కూడ—

ఇది వర్తకం—ఇందులోనూ ఇచ్చి పుచ్చుగోడాలే!

నన్ను అంతా వెలివేస్తే మాత్రం?—నా బిడ్డలు బదకరూ?

అదేచాలు—అంతే చాలు—

నాకు తిండి లేకపోతేనేంగాక!